సాక్షి
మహబూబ్‌నగర్
సోమవారం ; 15 ; ఏప్రిల్ ; 2024



ధాన్యం దొంగలెవరు?

పెద్దాపూర్ మార్కెట్ గోదాంలో ధాన్యం చోరీ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వివరాలు 8లో ▸



కలిసి పోరాడితేనే..

బీజేపీని నిలువరించాల్సిన అవసరం ఉందని కూనంనేని సాంబశివరావు అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.4 /21.7

ఉదయం ఉంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు బలంగా వీస్తాయి. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

హజ్‌యాత్రపై సంపూర్ణ అవగాహన



స్టేషన్ మహబూబ్‌నగర్: హజ్‌యాత్రపై యాత్రికులు సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని మౌలానా ముఫ్తి సయ్యద్ ఖాసీం అలీ అన్నారు. జిల్లాకేంద్రంలోని జేజేఆర్ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో హజ్‌యాత్రికుల శిక్షణ శిబిరం నిర్వహించారు. శిబిరంలో ముఖ్య వక్తగా ప్రముఖ ధార్మికవేత్త సయ్యద్ ఖాసీం అలీ పాల్గొని హజ్‌యాత్రపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్‌యాత్ర చేయాలని చాలామంది ముస్లింలు కోరుకుంటారని, కానీ, కొందరికే ఆ అవకాశం లభిస్తుందన్నారు. నిబద్ధతతో హజ్ యాత్ర చేయాలని సూచించారు. ఇలాంటి శిక్షణ శిబిరాలను యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యాత్రపై ఎలాంటి సందేహాలు ఉన్నా మతపెద్దల దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా హజ్‌సొసైటీ అధ్యక్షుడు మహమూద్‌అలీ, చీఫ్ ప్యాట్రన్ రవూఫ్, సత్తార్, రజాక్ నిజామీ, యూసుఫ్, అహ్మద్ పటేల్, ఎండీ రఫీక్, ఖాజా నిజాముద్దీన్, రజాక్, కలీం, ఎండీ ఇషాక్, రఫీక్ ఉర్ రెహమాన్, మూసా, అజహర్, ఎండీ అర్షద్‌అలీ, ఎండీ సిద్ధిఖ్, ఎండీ జియావుద్దీన్, సిరాజ్, నజీరుద్దీన్ పాల్గొన్నారు.

బడుగుల సంక్షేమమే బీజేపీ లక్ష్యం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గత పదేళ్లలో బడుగుల సంక్షేమమే లక్ష్యంగా దేశంలో బీజేపీ ప్రభుత్వ పాలన సాగిందని పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం స్థానిక కాళికాంబ కల్యాణ మండపంలో నిర్వహించిన ఎస్టీ మోర్చా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గిరిజన బిడ్డల చదువు కోసం రాష్ట్రానికి గిరిజన వర్సిటీ కేటాయించిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. పంచాయతీలకు, తండాలకు నిధులిచ్చి ఆదుకున్నది కేంద్ర ప్రభుత్వమేనన్నారు. ఉచిత రేషన్ బియ్యం, గ్రామీణ యువత కోసం ఖేలో ఇండియా వంటి పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే గిరిజన లిపికి అధికార గుర్తింపు తీసుకొస్తానని, ముఖ్యంగా తండాలు, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు తదితర సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అనంతరం బాలానగర్ మండల కాంగ్రెస్ నాయకుడు లక్ష్మణ్‌తోపాటు మహబూబ్‌నగర్ పట్టణంలోని కొత్తగంజికి చెందిన సుమారు వంద మంది ఓబీసీలు బీజేపీలో చేరారు. సమావేశంలో పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాదయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్షలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మున్సిపాలిటీ పరిధిలోని దివిటిపల్లి ఐటీ పార్కులో కాలుష్య కారక పరిశ్రమ (లిథియం అయాన్ గిగా కంపెనీ) ఏర్పాటు చేయొద్దంటూ చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం 28వ రోజుకు చేరుకున్నాయి. కాగా, అమరరాజా వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రతిరోజూ నలుగురు చొప్పున నిరాహార దీక్షలు చేపట్టాలని నిర్ణయించారు. ఆదివారం స్థానిక 4వ వార్డు పరిధిలోని ఎదిరలో తిరుపతిరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, భరత్‌చారి, యాదయ్య ఈ దీక్షకు పూనుకోగా.. వివిధ సంఘాల నాయకులు మద్దతు పలికారు.

పాత నేరస్తులపై నిఘా

జిల్లాలో రౌడీషీటర్లపై పోలీసుల ప్రత్యేక దృష్టి

- ఇప్పటికే తుపాకులు అప్పగించాలని ఆదేశాలు
- సంబంధిత ఠాణాల్లో ప్రత్యేక కౌన్సిలింగ్
- బైండోవర్లు, పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరిక
- పార్లమెంట్‌ఎన్నికల నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం



పోలీస్ రికార్డుల ప్రకారం రౌడీషీటర్లు : 800
ప్రస్తుతం నమోదైన కేసులు : 270
బైండోవర్ చేసిన పాత నేరస్తులు : 399
ఇప్పటి వరకు అప్పగించిన లైసెన్స్ తుపాకులు : 6

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల వాతావరణ రోజురోజుకూ వేడెక్కుతోంది. ఇప్పటికే పోలీస్‌శాఖ ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టిపెట్టింది. హత్యలు, అపహరణ, రౌడీయిజం, దౌర్జన్యాలు, కుమ్ములాటలు, గొడవలు, బెదిరింపులు వంటి నేరాలకు పాల్పడుతున్న రౌడీషీటర్లు ఎన్నికల్లోనూ తమ ప్రభావం చూపుతున్నారు. సార్వత్రిక, స్థానిక తదితర ఎన్నికల్లో తెరవెనక పని చేసి ఏ పార్టీ తరఫున నజరానాలొస్తే వారికి అనుకూలంగా వ్యవహరిస్తుంటారు. ఓటర్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రాత్రివేళల్లో అడ్డాలు వేయడం, మందు పార్టీలు నిర్వహించడం, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నాయకుల ప్రయత్నాల్లో సహకారం అందిస్తుంటారు. 2009, 2014, 2018, 2023 అసెంబ్లీ, ఎంపీ, స్థానిక ఎన్నికల్లో కొందరు రౌడీషీటర్లు ప్రత్యర్థులు, వారి వెంట తిరిగే అనుచరులను హెచ్చరించారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. పోలీస్‌స్టేషన్ల వారీగా రౌడీషీటర్లు, గ్యాంగ్‌స్టర్లు, హిస్టరీ షీటర్లు వారి అనుచరుల చిట్టా తిరగేస్తున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్టు ప్రయోగిస్తామని హెచ్చరిస్తున్నారు. జిల్లాలో వివిధ రకాల నేర ప్రవృత్తి ఉన్న రౌడీషీటర్లను బైండోవర్‌లో భాగంగా పిలిచి తహసీల్దార్ ఎదుట హాజరుపరుస్తూ రూ.లక్ష వ్యక్తిగత పూచీకత్తుతో వదిలిపెడుతున్నారు. ఎన్నికలు అయ్యే వరకూ రోజూ ఆయా పోలీస్ స్టేషన్లకు వచ్చి కనబడిపోవాలని ఆదేశించారు.

తుపాకుల అప్పగింత

జిల్లాలో లైసెన్స్ తుపాకులు కలిగిన వారు కొందరు ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో తుపాకులు అప్పగిస్తున్నారు. మహబూబ్‌నగర్ టూటౌన్ పరిధిలో ముగ్గురు, మహబూబ్‌నగర్ రూరల్ పరిధిలో ఇద్దరు, జడ్చర్లలో ఒకరు తుపాకులను అప్పగించారు.

పోలీస్‌స్టేషన్ల వారీగా..

జిల్లా పోలీస్ శాఖ పరిధిలో తాజా రికార్డుల ఆధారంగా దాదాపు 800మందికి పైగా రౌడీషీటర్లు ఉన్నారు. జిల్లాలో నేరాలను కట్టడి చేసేందుకు, భౌతిక దాడులకు పాల్పడుతున్న వారి కార్యకలాపాలను నిలువరించేందుకు పీడీ చట్టం ప్రయోగించారు. జిల్లాలో కొంత మందిని పీడీ యాక్టు ఉపయోగించి జైళ్లకు పంపించారు. ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా రౌడీషీటర్లలో ఎంత మంది జైల్లో ఉన్నారు.. బెయిల్‌పై ఎంత మంది బయట ఉన్నారు అన్న వివరాలను పోలీస్‌స్టేషన్ వారీగా సేకరించారు. రౌడీషీటర్ల ఫోన్ నెంబర్లు వారి అనుచరుల వివరాలు తీసుకున్నారు. కొందరు రౌడీషీటర్ల అనుచరులు వివిధ పార్టీల నాయకులు, వారి అనుచరులతో రహస్యంగా సంప్రదింపులు చేస్తున్నారని పోలీసులు గ్రహిస్తున్నారు.

పోలీసుల వద్ద చరిత్ర

మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు 800 మందికిపైగా రౌడీషీటర్లు ఉన్నారు. వ్యవస్థీకృత నేరాలు, దందాలు, బెదిరింపులు, హత్యలు, రౌడీయిజం, దౌర్జన్యాలు, అక్రమ వ్యాపారాలు, అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నారు. నేరాల తీవ్రత ఆధారంగా వారిపై పోలీసులు రౌడీషీట్ తెరిచారు. 20 ఏళ్ల కిందట రౌడీషీట్ నమోదై నేరాలను కొనసాగిస్తున్న వారి నుంచి కొత్తగా రౌడీషీట్ ఉన్న వారు ఈ జాబితాలో ఉన్నారు. ఎన్నికలు, పండగలు, గణేష్ నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ముందస్తుగా వారి పోలీస్‌స్టేషన్‌కు పిలిచి బైండోవర్ చేయడం వంటివి కొనసాగుతుండటం సాధారణం. జిల్లాలో నేరస్తుల సర్వే నిర్వహించినప్పుడు ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారి వివరాలను సేకరించారు. తాజా ఫొటోలతో వారిపై నమోదైన నేరాలు, శిక్షలు, ప్రస్తుత జీవన విధానం, ప్రవర్తన కుటుంబ వివరాలు సేకరించి నేరాలను బట్టి కొత్తగా హిస్టరీ షీట్ పొందుపరుస్తున్నారు.



మహబూబ్‌నగర్‌లో వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు

బైండోవర్ చేస్తున్నాం..



గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో 1,500 మంది పాత నేరస్తులను బైండోవర్ చేశాం. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ప్రక్రియ కొనసాగుతుంది. రూ.లక్ష పూచీకత్తుతో తహసీల్దార్ ఎదుట హాజరుపరుస్తున్నాం. ఎన్నికల సమయాల్లో ఎలాంటి కేసు నమోదైనా రూ.లక్ష చెల్లించడమా.. లేక జైలుశిక్ష అనేది ఉంటుంది.

– వెంకటేశ్వర్లు, డీఎస్పీ, మహబూబ్‌నగర్

జనజాతరకు సర్వం సిద్ధం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్, డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి

నేడు 'పేట'కు సీఎం రేవంత్‌రెడ్డి రాక

- భారీగా జనసమీకరణకు శ్రేణుల తలమునకలు
- 670 మంది పోలీసులతో బందోబస్తు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



జన జాతరకు సిద్ధమవుతున్న సభావేదిక

నారాయణపేట: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం 6 గంటలకు నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న జనజాతర బహిరంగ సభకు రానున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి తరఫున ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో జనజాతరకు నారాయణపేట నియోజకవర్గంలోని కోయిలకొండ, ధన్వాడ, మరికల్, దామరగిద్ద, నారాయణపేట టౌన్, మండలాల నుంచి జనాన్ని భారీఎత్తున తరలించేందుకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. జనజాతరకు దాదాపు 50 వేల మందిని తరలించి సభను విజయవంతం చేసేందుకు సంకల్పించారు. సభకు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు రాష్ట్ర మంత్రులు, ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. ఈ క్రమంలో ఆదివారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభావేదిక, ప్రాంగణాన్ని ఎమ్మెల్యే పర్యవేక్షించి ఏర్పాట్లు పరిశీలించారు.

సిబ్బందికి ఎస్పీ దిశానిర్దేశం

జనజాతర సభకు ఉమ్మడి జిల్లా నుంచి బందోబస్తుకు వచ్చిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ యోగేష్ గౌతమ్ భద్రతాపరమైన సూచనలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో బందోబస్తు 12 సెక్టార్లుగా విభజించి పకడ్బందీగా భద్రత కల్పించాలని, పోలీస్ అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన ప్రదేశాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధులు నిర్వర్తించే సమయంలో సంయమనం పాటించాలని ఎస్పీ కోరారు. పబ్లిక్ గ్యాలరీ, పార్కింగ్, ట్రాఫిక్ డైవర్షన్ సెక్టార్ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీలు నాగేంద్రుడు, రియాజ్ హుల్ హక్, డీఎస్పీలు లింగయ్య, మహేష్, శ్రీనివాసులు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు..

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి జనజాతర బహిరంగ సభకు రానుండటంతో ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆధ్వర్యంలో పోలీస్‌శాఖ 670 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పకడ్బందీగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. బహిరంగ సభలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. బందోబస్తులో ఇద్దరు అదనపు ఎస్పీలు, ఐదుగురు డీఎస్పీలు, 25 మంది సీఐలు, 65 మంది ఎస్ఐలు, 75 మంది ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు 415, మహిళా పోలీసులు 50, 2 రోప్ పార్టీలు, 2 టీఎస్ఎస్పీ ప్లాటున్స్, స్పెషల్ పార్టీ పోలీసులు, 2 ఐటీబీపీ ప్లాటూన్స్‌తో బందోబస్తు నిర్వహించనున్నారు.

ప్రపంచ మేధావి.. అంబేడ్కర్



కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు, అధికారులు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ రూరల్/ మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రపంచ మేధావిగా పేరు తెచ్చుకున్న భారతరత్న బాబా సాహెబ్ అంబేడ్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని కలెక్టర్ రవినాయక్ అన్నారు. ఆదివారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు రాజ్యాంగాన్ని అంబేడ్కర్ రచించారన్నారు. ప్రపంచం గర్వించదగిన గొప్ప మేధావి అన్నారు. ఆయన చూపిన మార్గంలో నడిచి, దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. 2004లో అమెరికా కొలంబియా విశ్వవిద్యాలయం ప్రపంచంలోనే టాప్ 100 మేధావుల జాబితా రూపొందిస్తే అందులో అంబేడ్కర్ ప్రథమ స్థానంలో నిలిచారని కొనియాడారు. చదువుకోవడం వల్ల జీవితాల్లో స్పష్టమైన మార్పు తప్పనిసరిగా వస్తుందనడానికి అంబేద్కర్ వంటి మహనీయులు నిదర్శనమన్నారు. దేశ స్వాతంత్ర ఉద్యమంలో, రాజకీయ రంగంలో, సామాజిక వేత్తగా, విద్యావేత్తగా ప్రత్యేకముద్ర వేశారన్నారు. స్త్రీల హక్కుల కోసం ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని చెప్పారు. పురుషులతో సమానంగా స్త్రీలకు హక్కులు కల్పిస్తూ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. దేశంలో కార్మికుల సంక్షేమం వారికి రాజ్యాంగబద్ధమైన హక్కులను కల్పించడంలో కీలకపాత్ర పోషించారని, కార్మిక చట్టాలను రాజ్యాంగంలో పొందుపరిచారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఎస్సీ కార్పొరేషన్ డీడీ పాండు తదితరులు పాల్గొన్నారు. అలాగే కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అంబేడ్కర్ చిత్రపటానికి అదనపు కలెక్టర్ మోహన్‌రావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

'కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు'

- ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి



భూత్పూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి. పక్కన మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి తదితరులు

భూత్పూర్: ప్రజలను మోసం చేయడానికే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరు చెబుతోందని, వాటిని నమ్మి మోసపోవద్దని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని, అధైర్యపడకుండా ఉండాలని వారు సూచించారు. ఆదివారం భూత్పూర్‌లో నిర్వహించిన సమావేశంలో వారితోపాటు మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రజలు వంద రోజులకే కాంగ్రెస్ పాలనపై విసుగు చెందారని, మళ్లీ బీఆర్ఎస్ పాలన కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాలం గడుపుతారే తప్ప అమలు చేయడం వారి వల్ల కాదని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎన్నికలు వచ్చినప్పుడుల్లా రాముడి పేరుతో రాజకీయం చేస్తుందని, రాముడు వారికే కాదు మనందరికీ రాముడే అని, దేవుడి పేరుతో రాజకీయం చేయడం తగదన్నారు. గతంలో జరిగిన పొరపాట్లకు తావు ఇవ్వకుండా ఎంపీగా మళ్లీ గెలిపించడానికి కార్యకర్తలు, నాయకులు కృషిచేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలన ఏంటోనని ప్రజలకు అర్థమైందని, నాలుగు నెలల్లో తెలంగాణలో కరువుఛాయలు అలుముకున్నాయని విమర్శించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, నాయకులు నారాయణగౌడ్, సత్యనారాయణ, మురళీధర్‌గౌడ్, మహ్మద్ సాధిక్, సరోజ్‌రెడ్డి, ఖాజ, రాముదాథోడ్, మాధవరెడ్డి, యాదిరెడ్డి, యాదయ్య, వెంకట్రాములు, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

- మే 1వ తేదీ నుంచి నెల రోజులపాటు నిర్వహణ
- ఈ నెల 20 వరకు దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు



జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో వాలీబాల్ శిక్షణ తీసుకుంటున్న ఔత్సాహిక క్రీడాకారులు (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: ఔత్సాహిక క్రీడాకారులకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు మంచి వేదికగా ఉపయోగపడుతున్నాయి. జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది వేసవి సెలవుల్లో చిన్నారులు, యువత కోసం ప్రత్యేక వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. క్రీడాకారుల కోసం నెల రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో వేలాదిమంది ఔత్సాహిక క్రీడాకారులు శిక్షణ తీసుకుంటారు. ఈ శిబిరాల్లో ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతారు.

శాట్ ఆదేశాల మేరకు..

ఈ ఏడాది జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) ఆదేశాల మేరకు జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 10 వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు. అయితే జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో పట్టణ ప్రాంతాల ఔత్సాహిక క్రీడాకారుల కోసం అర్బన్ కింద మరో 12 నుంచి 15 వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తారు.

దరఖాస్తుల స్వీకరణ

ఈ ఏడాది జిల్లాలో నిర్వహించే వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ఏర్పాటుపై జిల్లా యువజన, క్రీడాశాఖ కార్యాచరణ రూపొందిస్తుంది. ప్రధాన ఆటలకు సంబంధించి మే 1వ తేదీ 30 వరకు (నెలరోజులపాటు) ఔత్సాహిక క్రీడాకారులకు క్రీడాశిక్షణ అందజేస్తారు. ఈ మేరకు జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో వేసవి క్రీడా శిబిరాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ మేరకు జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ ఇటీవలే వేసవి క్రీడా శిక్షణా శిబిరాల దరఖాస్తుల కోసం ప్రకటన విడుదల చేశారు. జాతీయస్థాయి సీనియర్ క్రీడాకారులు లేదా వ్యాయామ ఉపాధ్యాయులు (పీడీ, పీఈటీ), క్రీడాకారులు వేసవి క్రీడా శిబిరాలు నిర్వహించడానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తుతోపాటు క్రీడల్లో తాము సాధించిన ధ్రువపత్రాలను జిల్లాకేంద్రం మెయిన్ స్టేడియంలోని యువజన, క్రీడా కార్యాలయంలో వ్యక్తిగతంగా లేదా పోస్ట్ ద్వారా పంపాలి.

సద్వినియోగం చేసుకోండి



ఈ ఏడాది వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. గతేడాది వేసవి శిబిరాల్లో చాలామంది విద్యార్థులు, ఔత్సాహిక క్రీడాకారులు పాల్గొన్నారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు సంబంధించి సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. వేసవి శిబిరాలను 8- 16 ఏళ్ల లోపు బాల, బాలికలు సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

క్రీడాకారుల్లో నైపుణ్యం



వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఔత్సాహిక క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడుతాయి. ఈ శిబిరాల వల్ల క్రీడాకారుల నైపుణ్యం బయటికి వస్తుంది. వేసవి శిక్షణ శిబిరాల వల్లనే పలువురు కబడ్డీ క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ శిబిరాలను ఔత్సాహిక క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి.

– కురుమూర్తిగౌడ్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే యెన్నం తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా పాలమూరు మున్సిపాలిటీలో కౌన్సిలర్లతో చర్చించి పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తున్న విధానం నచ్చి ఇతర పార్టీల వారు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఇక్కడ జరిగే ప్రతి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అందరి సహకారం, ఆశీస్సులతో వచ్చిన మెజార్టీ కన్నా అధికంగా పార్లమెంట్ ఎన్నికల్లో ఇవ్వాలని కోరారు. నాడు నలుగురు కలిసి మాట్లాడినా కేసులే.. ఇప్పుడు చట్టం కల్పించిన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు భంగం కలగకుండా, చట్టబద్ధంగా ఎవరు ఏమి మాట్లాడినా అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. నల్లధనం తెచ్చి రూ.15 లక్షలు పేదల అకౌంట్లలో జమఅవుతాయని చెప్పిన హామీ ఏమైందని, ఏడాదికి రూ.2 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ పోయాయని డీకే అరుణను ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు వినోద్‌కుమార్, ఎన్పీ వెంకటేశ్, చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్, బెక్కరి అనిత తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే లోడింగ్, అన్ లోడింగ్ హమాలీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు.

క్లుప్తంగా

రైలు కింద పడి మహిళ మృతి

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు రైలు కిందపడి మహిళ మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ ఆదివారం తెలిపారు. గుంటూర్ జిల్లా మంతెనవారి పల్లెం చెందిన శశి ప్రియాంక (30) శనివారం రాత్రి గుంటూరు నుంచి జడ్చర్లకు రైలులో ప్రయాణిస్తుంది. అయితే ఆదివారం ఉదయం పట్టణంలోని పాత హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో ప్రమాదవశాత్తు కదులుతున్న రైలు నుంచి జారి కిందపడింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. భర్త జడ్చర్లలోని అరబిందో ఫార్మా కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. భర్త వేముల వెంకట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

హైదరాబాద్‌లో రాజాపూర్ వాసి..


మహేష్ (ఫైల్)

కోడేరు: హైదరాబాద్‌లో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మండలంలోని రాజాపూర్ చెందిన యువకుడు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తెలుగు బక్కయ్య, చిట్టమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు గోపాల్ పదేళ్ల క్రితం బావిలో పడి మృతి చెందాడు. చిన్న కుమారుడు మహేష్ (20) బతుకుదెరువు కోసం హైదారాబాద్ పట్టాన్‌చెరులో తన అక్క అంజనమ్మ దగ్గర ఉండేవాడు. శనివారం రాత్రి 7 గంటలకు పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వెళ్తున్న ట్రావెల్స్ బస్సు బస్సు అదుపు తప్పి కారు, ఆటో మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి డివైడర్ ఎక్కింది. అదే సమయంలో రోడ్డు దాటుతున్న మహేష్‌ను బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


రమేష్ (ఫైల్)

గోపాల్‌పేట: కుటుంబసభ్యులతో గొడవపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బుద్దారంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మునగాల రమేష్ (41) శనివారం మద్యం తాగి తన భార్య జయమ్మ, తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. ఆ తర్వాత రాత్రి ఇంట్లోకి వెళ్లి లోపలి నుంచి గడియ పెట్టుకుని పడుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున రమేష్ పడుకున్న గదిలో శబ్దం రావడంతో భార్య జయమ్మ ఆమె మరిదిని పిలిచి గది తలుపు పగులగొట్టి చూడగా అప్పటికే చీరతో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


మెహ్రూన్ (ఫైల్)

కొత్తకోట రూరల్: మోటార్‌ను ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై మహిళ మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణ కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాల్‌పేట మండలం బుద్దారం చెందిన మెహ్రూన్(45) కొంత కాలంగా తల్లిగారి నివాసమైన కొత్తకోటలో ఉంటుంది. మెహ్రూన్ భర్త మూడేళ్ల క్రితం మృతి చెందాడు. కూతురికి వివాహం కాగా కుమారుడితో కలిసి కొత్తకోటలోని రాఘవేంద్రకాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. ఆదివారం దుస్తులు ఉతికేందుకు కరెంట్ మోటార్ వేసేందుకు ప్లగ్ పెట్టే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై కింద పడిపోయింది. గమనించిన చుట్టుపక్కల వారు వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కాగా మృతదేహాన్ని బుద్దారం తరలించి అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

కుక్కలదాడిలో 40 గొర్రెలు..



మక్తల్: మండలంలోని ముష్టిపల్లిలో ఆదివారం గొర్రెల మందపై కుక్కలు దాడి చేశాయి. యాంకి రాజుకు చెందిన 40 గొర్రెలు మృతి చెందడంతో దాదాపు రూ.2లక్షలు నష్టం వచ్చింది.

పోలీసుల అదుపులో చోరీ నిందితులు?

పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలో ఈ నెల 10వ తేదీ అర్ధరాత్రి 8 దుకాణాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించి చోరీ చేసిన వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై స్థానిక ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి వివరణ కోరగా.. నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని, విచారణ చేసి వివరాలను వెల్లడిస్తామన్నారు.

ధాన్యం దొంగలెవరు?


పెద్దాపూర్ గోదాములో నిల్వ ఉన్న ధాన్యం

- సంశయంగా మారిన పెద్దాపూర్ మార్కెట్ గోదాము చోరీ ఘటన
- ఈనెల 3న 14వేల బస్తాల ధాన్యం చోరీ అయినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- సీఎంఆర్ అప్పగించలేకే కొత్త నాటకానికి తెర లేపారన్న అనుమానాలు?

కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌కు సంబంధించిన గోదాంలో వారం రోజుల కిందట భారీ చోరీ జరిగింది. అందులో ప్రభుత్వం మిల్లర్లకు అందించిన ధాన్యమే ఉండటం.. ఇటీవల వంద శాతం సీఎంఆర్ అప్పగించాలని మిల్లర్లపై ప్రభుత్వం ఒత్తిడి తీసుకొస్తున్న నేపథ్యంలో ధాన్యం చోరీకి గురైందని చెప్పడం పలు అనుమానాలకు దారితీస్తోంది. వివరాల్లోకి వెళ్తే..

వెల్దండ మండలం పెద్దాపూర్‌లో వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో మూడు కంపార్ట్‌మెంట్లతో కూడిన భారీ గోదాము నిర్మించారు. అందులో ప్రభుత్వం కేటాయించిన సీఎంఆర్ ధాన్యాన్ని నిల్వ చేసేందుకు కల్వకుర్తికి చెందిన ఇద్దరు మిల్లర్లు 2020–21 ఆర్థిక సంవత్సరంలో అద్దెకు తీసుకున్నారు. ప్రతినెలా రూ. 33వేల అద్దె చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. ఇలా ఒప్పందం చేసుకున్న నాటి నుంచి ఇప్పటి వరకు కొంత మొత్తాన్ని చెల్లించగా.. ప్రస్తుతం ఏప్రిల్ వరకు రూ.20 లక్షల బకాయి చెల్లించాల్సి ఉంది. కాగా, 2022 జూలైలో గోదాము అద్దె చెల్లించాలని మిల్లర్లను కోరిన రెండు రోజులకే ఒక కంపార్ట్‌మెంట్‌లో ఉన్న ధాన్యాన్ని తరలించారని మార్కెట్ అధికారులు చెబుతున్నారు. దీంతో మార్కెట్‌కు సంబంధించిన మరో తాళాన్ని గోదాము గేటుకు వేశామని కార్యదర్శి భగవంత్ తెలిపారు.

చోరీ వాస్తవమేనా..

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చాక సివిల్ సప్లయ్ శాఖకు ఐపీఎస్ అధికారిని కమిషనర్‌గా నియమించి, సీఎంఆర్ బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈమేరకు జిల్లా అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు. ప్రభుత్వం నుంచి ధాన్యం పొందిన మిల్లర్లపై సైతం అదే రీతిలో ఒత్తిడి పెరుగుతోంది. ఈక్రమంలో ధాన్యాన్ని ప్రైవేటు మార్కెట్‌లో అమ్ముకున్న మిల్లర్ల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. పెద్దాపూర్ చోరీ ఘటనకు సంబంధించి మార్కెట్ గోదాము అద్దె బకాయి పెరగడం.. ప్రభుత్వం నుంచి సీఎంఆర్ బకాయి చెల్లించాలని ఒత్తిడి పెరగటంతో చోరీ నాటకానికి తెర లేపారన్న చర్చ సాగుతోంది. రూ.కోట్ల విలువజేసే ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

అనుమానాలెన్నో..

పెద్దాపూర్ గ్రామానికి కూతవేటు దూరంలో ఉన్న గోదాములో రెండేళ్ల కిందట 2వేల బస్తాలు, ఈనెల 3వ తేదీన మరో 12వేల బస్తాల ధాన్యం చోరీ అయ్యిందని ఇద్దరు మిల్లర్లు అదే రోజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఒక లారీలో సుమారు 300 బస్తాల ధాన్యం తరలించేందుకు అవకాశం ఉంటుందని లారీల ఓనర్లు చెబుతున్నారు. ఈ లెక్కన ఒక్క రోజులో 12వేల బస్తాలను తరలించడానికి సుమారు 40 లారీలు అవసరం. ఒక్కో లారీలో బస్తాలను నింపడానికి గంటకు పైగా సమయం పడుతుంది. ధాన్యం తరలింపునకు దాదాపు రెండు రోజుల సమయం పడుతుంది. పెద్ద మొత్తంలో ధాన్యం తరలిస్తుంటే సదరు వ్యాపారులకు సమాచారం తెలియకుండా ఉంటుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, గోదాము వైపు వరుసగా లారీలు ఇతర వాహనాలు వెళ్లినట్లు ఎలాంటి ఆనవాళ్లు లేవని పోలీసు అధికారుల ప్రాథమిక విచారణలో తేలినట్లు తెలుస్తోంది.

బకాయిలు చెల్లించాలి..



కల్వకుర్తికి చెందిన ఇద్దరు మిల్లర్లు 2021–22 ఆర్థిక సంవత్సరంలో ధాన్యాన్ని నిల్వ చేసేందుకుగాను గోదాం లీజుకు ఇచ్చాం. అందుకు సంబంధించి రూ.20 లక్షల బకాయి ఉంది. 2022లోనే బకాయిలు చెల్లించాలని అడిగితే, ఒక కంపార్ట్‌మెంటులోని ధాన్యాన్ని తీసుకెళ్లారు. ఆ సమయంలో మేము గోదాం గేటుకు తాళంవేశాం. ఏప్రిల్ మొదటి వారంలో వెల్దండ పోలీసులు వచ్చి, మీ గోదాం పరిధిలో చోరీ జరిగిందని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వారు అడిగిన వివరాలన్నీ సమర్పించాం. మా బకాయిలు చెల్లించకుండా గోదాము ఖాళీ చేయరాదని పోలీసులు, ఇద్దరు వ్యాపారులకు తెలియజేశాం.

– భగవంత్, మార్కెట్ కార్యదర్శి, కల్వకుర్తి

కేసు నమోదు చేశాం..



పెద్దాపూర్ గోదాంలో ధాన్యం చోరీ ఘటనపై లీజుకు తీసుకున్న వ్యాపారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో కేసు విచారణను వేగవంతం చేయడమే గాక, పూర్తి వివరాలను సేకరించాం. త్వరలోనే నిందితులను పట్టుకుంటాం.

– రవి, ఎస్ఐ, వెల్దండ

నిజాలు నిగ్గుతేలేనా..

పెద్దాపూర్ గోదాము చోరీ తరహాలోనే ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల చోరీలు జరిగాయి. సీఎంఆర్‌కు సంబంధించి సివిల్ సప్లయ్ అధికారులు ఒత్తిడి పెంచడంతోనే ఈ చోరీలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. పెద్దాపూర్ గోదాము చోరీకి సంబంధించి చేపట్టిన విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయా అనే చర్చ సాగుతోంది. గోదాములో చోరీ జరిగిన విషయంపై లీజుకు తీసుకున్న వ్యాపారులే పోలీసులకు ఫిర్యాదు చేస్తే తప్ప.. ఎవరికీ తెలియకపోవడం గమనార్హం.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగభూషనరావు

పెబ్బేరు రూరల్: హత్య కేసులో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నాగభూషనరావు తెలిపారు. ఆదివారం వనపర్తి పట్టణ కేంద్రంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వనపర్తి పట్టణానికి చెందిన బాలరాజు (45) గద్వాలలోని ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 8న బస్టాండ్ ఆవరణలోని బైక్ పార్కింగ్ వద్ద గాయాలతో స్పృహ కోల్పోయి పడి ఉండడంతో అతన్ని ఆస్పత్రికి తరలించారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ 12న మృతి చెందాడు. మృతుని భార్య గాయత్రి వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విచారించిన పోలీసులు ఆ రోజు మన్యం, బాలరాజు మధ్య గొడవ జరిగిందని నిర్ధారించారు. వనపర్తి పట్టణంలోని పీర్లగుట్టకు చెందిన మన్యంను 8న బస్టాండ్‌లోని కూర్చుని ఉండగా, బాలరాజు వచ్చి బూతులు తిట్టి అక్కడే ఉన్న కర్రతో తలపై కొట్టాడు. వారు ఇద్దరు గొడవపడుతుండగా ప్రయాణికులు విడిపించారు. కోపంతో మన్యం ఆ రోజంతా బాలరాజును వెతికాడు. అదే రోజు రాత్రి బస్టాండ్ ఆవరణలో బైక్ పార్కింగ్ వద్ద బాలరాజు కనబడడంతో వెంటనే మన్యం రాయితో ముఖం, తలపై బలంగా కొట్టడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. మన్యంపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

చిట్టెబోయిన్‌పల్లిలో చోరీల కలకలం

జడ్చర్ల: మండల పరిధిలోని చిట్టెబోయిన్‌పల్లిలో శనివారం రాత్రి చోరీలు కలకలం సృష్టించాయి. ఈ విషంలో గ్రామస్తులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కొమ్ము్రి తిరుపతమ్మ తన భర్తతో పాటు శనివారం రాత్రి తమ ఇంటి ఎదుట ఆరుబయట నిద్రించారు. కాగా నిద్రలో ఉండగా.. దొంగలు తన మెడలోని పుస్తెల తాడు, తాళిబొట్టుతో పాటు 15 బంగారం గుండ్లు దొంగిలించారు. అలాగే తమ ఇంటి ముందు నిద్రలో ఉన్న ఇదే గ్రామానికి చెందిన చంద్రమ్మ మెడలోని పుస్తెలు సూతవ అపహరించుకుని పోయారని ఆమె ఫిర్యాదు చేసింది. అలాగే ఆదే గ్రామానికి చెందిన కృష్ణయ్య అనే వ్యక్తికి చెందిన బైక్ తన ఇంటి ముందు ఆపి నిద్రిస్తుండగా.. దాన్ని సైతం చోరీ చేశారని బాధితులు పోలీసులకు వివరించారు. ఒకే రోజు ఒకే గ్రామంలో వరుస చోరీల విషయంలో చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతున్నారు.

గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

జడ్చర్ల: మండల పరిధిలోని గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం రాత్రి పప్పుదినుసులు, బియ్యం, గ్యాస్ సిలిండర్ వంట పాత్రలు చోరీకి గురైనట్లు గ్రామంలోని 2వ అంగన్‌వాడీ కేంద్రం టీచర్ నిర్మల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదివారు తాము అంగన్‌వాడీ కేంద్రంలో అంబేద్కర్ జయంతి నిర్వహించేందుకు వెళ్లగా అక్కడ చోరీ చేసిన సంఘటన బయట పడిందని పోలీసులకు తెలియజేశారు.

కుక్కల దాడిలో జింక మృతి


కుక్కల దాడిలో మృతిచెందిన జింక →

ఖిల్లాఘనపురం: కుక్కల దాడిలో జింక మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. సమీపంలోని గుట్ట నుంచి మూడు జింకలు గ్రామంలోకి వచ్చాయి. వాటిని గమనించిన కుక్కలు వేటాడడంతో రెండు జింకలు తప్పించుకుని పారిపోగా.. మరో జింక తీవ్రంగా గాయపడింది. గ్రామస్తులు గమనించి కుక్కల గుంపును చెదరగొట్టారు. కొనఊపిరితో ఉన్న జింకను రక్షించేందుకు గ్రామస్తులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కుక్కలు వదిలిన కొంత సేపటికే జింక మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎఫ్ఆర్ఓ మంజుల, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతి చెందిన జింకను ఖననం చేశారు.

మనస్తాపంతో యువతి బలవన్మరణం

ఖిల్లాఘనపురం: ఇంటి పక్కన మహిళ గొడవ పెట్టుకున్నదని మనస్తాపంతో యువతి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటు చేసుకోగా ఆదివారం వెలుగు చూసింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బుడ్డెంకని అంజలి(25)కి అదే గ్రామంలోని దేవమ్మకు గతంలో గొడవలు జరిగాయి. ఈ విషయంలో ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఇటీవల దేవమ్మతో మళ్లీ గొడవ జరగడంతో మనస్తాపంతో శనివారం రాత్రి సమీపంలోని గుట్టకు వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రాత్రికి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టు పక్కల వారితో ఆరాతీశారు. ఆచూకీ లభించకపోవడంతో దేవమ్మతో కుటుంబ సభ్యులు గొడవకు దిగారు. ఆదివారం గుట్టలో ఓ చెట్టుకు అంజలి ఉరేసుకుని విగత జీవిగా కనిపించింది. దేవమ్మ వల్లనే చనిపోయిందని ఆగ్రహిస్తూ మృతురాలి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో దేవమ్మ ఇంటికి వెళ్లి, మృతదేహాన్ని ఇంటి ఎదుట ఖననం చేస్తామని చెప్పారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అందరిని శాంతింపచేశారు. కొత్తకోట సీఐ రాంబాబు, ఎస్ఐ శ్రీహరి సిబ్బందితో కలిసి వారందరిని పోలీస్‌స్టేషన్‌కు పిలిచి మాట్లాడారు. వారందరికీ నచ్చజెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై మృతురాలి భర్త బుడ్డెంకని బుచ్చన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి భర్త, కుమారుడు, కూతురు ఉన్నారు.

కారును ఢీకొన్న డీసీఎం: నలుగురికి గాయాలు


దేవరకద్ర వంతెనపై దెబ్బతిన్న కారు, డీసీఎం

దేవరకద్ర: మండల కేంద్రంలోని వంతెన వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. మహబూబ్‌నగర్ వైపు నుంచి వస్తున్న కారును దేవరకద్ర వైపు నుంచి లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వాహనం ఢీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న పెద్దరాజమూర్ చెందిన భాస్కర్, గోపాల్, మంగమ్మ, నాగమణి గాయపడ్డారు. వెంటనే వారిని అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఘటనా స్థలానికి వచ్చిన ఎమ్మెల్యే

రోడ్డు ప్రమాద ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. క్షతగాత్రుల పరిస్థితి గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా దేవరకద్ర, కౌకుంట్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి ప్రమాదం గురించి ఎమ్మెల్యేకు వివరించారు.

ట్రాఫిక్ జాం..

వంతెనపై ప్రమాదం కారణంగా ట్రాఫిక్ జాం అయ్యింది. ఇటు దేవరకద్ర వైపు అటు మహబూబ్‌నగర్ వైపు వాహనాలు బారులు తీరాయి. పోలీసులు వచ్చి జేసీబీతో దెబ్బతిన్న డీసీఎంను పక్కకు తొలగించారు. అలాగే కారును కూడ ఒక వైపుకు తీయించారు. దీంతో వాహనాలు ఒకటి తరువాత ఒకటి వెళ్లాయి. దాదాపు గంటకు పైగా ట్రాఫిక్ నిలిచింది.

ఏపీకి తరలిస్తున్న మద్యం పట్టివేత

అలంపూర్: అనుమతి లేకుండా తరలిస్తున్న మద్యం పట్టుబడినట్లు ఉండవెల్లి ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఏపీలోని నంద్యాల జిల్లాకు చెందిన వేణుగోపాల్ అలంపూర్‌చౌరస్తా నుంచి కర్నూల్ వైపు శనివారం అర్ధరాత్రి వెళ్తుండగా, జాతీయరహదారిపై ఉన్న పుల్లూరు టోల్‌ప్లాజా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద అతని బైక్‌ను తనిఖీ చేసినట్లు తెలిపారు. అతని వద్ద 27.54 లీటర్ల మద్యం లభించినట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.14,430 ఉంటుందని అంచనగా పేర్కొన్నారు. పట్టుబడిన మద్యంను స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. అనుమతి లేకుండా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

అయిజ: మండలంలోని సంకాపురం చెందిన శివారెడ్డి ఆదివారం రాత్రి ఉత్తనూరు నుంచి అయిజకు బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతనికి కుడి కాలు విరిగింది. అతన్ని బంధువులు 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దేశాయిపల్లిలో ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ


దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

దామరగిద్ద: ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొని పలువురికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేశాయ్‌పల్లి సమీపంలో ప్రధాన రహదారిపై నారాయణపేట నుంచి కోస్గి వెళ్తున్న ఆర్టీసీ బస్సు దామరగిద్ద మండలం దేశాయప్‌పల్లి సమీపంలో సాయంత్ర 6 గంటలకు రాంగ్‌రూట్‌లో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. పలువురి పరిస్థితి విషయమంగా ఉందని సమాచారం. క్షతగాత్రులను మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

బాలికను వేధించిన ఘటనలో యువకుడికి రిమాండ్

పాన్‌గల్: బాలికను ప్రేమించి పెళ్లి చేసుకోడానికి తీసుకెళ్తున్న యువకుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వేణు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను వనపర్తి మండలం వశ్యానాయక్‌తండాకు చెందిన శివ ప్రేమిస్తున్నానని చెప్పి పెళ్లి చేసుకోడానికి సిద్ధమయ్యాడు. విషయం బాలిక తల్లిదండ్రులకు తెలియడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి తక్షణమే సిబ్బందితో వారి ఆచూకీ తెలుసుకొని వారిని రెండు గంటల్లో అదుపులోకి తీసుకున్నారు. యువకుడిని రిమాండ్‌కు తరలించి, బాలికను తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

- జెండాల ఏర్పాటే కారణం
- ఐదుగురికి గాయాలు

మాగనూర్: మండల కేంద్రంలో ఇరువర్గాల ఘర్షణలో ఐదుగురుకి గాయాలైన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. గతంలో గ్రామానికి చెందిన శివాజీ యూత్ శివాజీ జయంతి సందర్భంగా బస్టాండ్ చౌరస్తాలో రహదారి మధ్యలో శివాజీ జెండా ఏర్పాటు చేశారు. అయితే శనివారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సంఘం నాయకులు అదే ప్రదేశంలో అంబేడ్కర్ జెండాను ఏర్పాటుచేశారు. దీంతో గ్రామానికి చెందిన కొందరు అభ్యంతరం తెలుపగా జెండాను మరో చోట ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జెండా అక్కడే ఏర్పాటు చేయడంతో ఓ వర్గానికి చెందిన కొందరు జెండాను తొలగించి పక్కన కట్టారు. మా జెండాను ఎలా తీస్తారని అంబేడ్కర్ సంఘం నాయకులు ప్రశ్నించగా అది కాస్తా ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదానికి దారి తీసింది. ఎన్‌హెచ్–167పై ఇరువర్గాలు రాస్తారోకో చేశాయి. దీంతో ఒక్కసారిగా గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిలువరించేందుకు స్థానిక పోలీసులు ప్రయత్నించినా ఇరువర్గాలు కట్టెలు, రాళ్లతో పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో ఐదుగురికి గాయాలయ్యాయి. చివరికి స్థానిక పోలీసులు ఇరు జెండాలను తొలగించడంతో గొడవ సద్దుమనిగింది. ఈ విషయంపై సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అంబేద్కర్ సంఘం నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.


రహదారిపై వాగ్వాదానికి దిగిన ఇరువర్గాలు

కలిసి పోరాడితేనే బీజేపీని నిలువరిస్తాం

- సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనంనేని సాంబశివరావు


మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

కొల్లాపూర్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నిలువరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకులు ఎస్ఎండీ ఫయాజ్ తండ్రి ఇటీవలే అనారోగ్యంతో మరణించడంతో ఆదివారం కొల్లాపూర్‌కు వచ్చి పరామర్శించి సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దేశంలో 400 సీట్లలో బీజేపీ విజయం సాధిస్తుందని చేసుకుంటున్న ప్రచారం వాస్తవానికి దూరంగా ఉందన్నారు. బీజేపీ పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కోసం చాలా ఇబ్బందులు పడుతోందని ఆరోపించారు. గతంలో ఉత్తరప్రదేశ్, బీహార్, గుజరాత్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో బీజేపీ వందశాతం సీట్లు గెల్చుకుందని, ఇప్పుడు ఆ పరిస్థితులు లేవన్నారు. మీడియా ద్వారా బీజేపీ కృత్రిమ బలాన్ని చూపుతోందని, ప్రజలు దీన్ని అర్థం చేసుకుంటున్నారన్నారు. రాముడు, రామమందిరం తప్ప బీజేపీకి చెప్పుకోవడానికి ఏమీ లేవన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు జపాన్, జర్మనీ వంటి దేశాల్లో పనిచేస్తాయి తప్ప మన దేశంలో కాదన్నారు. బీజేపీని నిలువరించకపోతే అందరికీ ప్రమాదమే అని హెచ్చరించారు. అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపర్చిన అంశాలను ఒకదాని వెంట ఒకటి బీజేపీ ప్రభుత్వం తొలగిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి మెజార్టీ సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మార్చే కుట్ర కూడా చేస్తుందన్నారు. ముస్లిం, మైనార్టీ వర్గాల హక్కులను కాలరాస్తోందని, రాష్ట్రాలపై, జాతులపై దాడులకు దిగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ సైతం పద్ధతిగా నడవకుండా లైన్ తప్పి, అన్నీ మేమే అనుకుంటే బీజేపీకి వారే అవకాశం ఇచ్చినట్లు అవుతుందన్నారు. బీజేపీపై నిబద్ధతతో పోరాటం చేసే కమ్యూనిస్టులను కలుపుకొని పోకుంటే నష్టపోయేది కాంగ్రెస్ వారే అన్నారు. స్వేచ్ఛ, లౌకికత్వం, రాజ్యాంగానికి రక్షణగా ఉంటున్నది కమ్యూనిస్టులు మాత్రమే అన్నారు. కలసిమెలసి సాగితేనే విజయం సాధిస్తామని, లేదంటే కేసీఆర్‌కు పట్టిన గతే వారికి కూడా పడుతుందన్నారు. రాష్ట్రంలో కరువుకు వరుణుడు, కేసీఆర్ ఇద్దరే కారణమన్నారు. కాళేశ్వరం పాపం సైతం కేసీఆర్‌దే అని దుయ్యబట్టారు. తాము ప్రభుత్వానికి అన్ని రకాలుగా సహకరిస్తామని వెల్లడించారు. సమావేశంలో నాయకులు బాల్‌నర్సింహ, కేశవులుగౌడ్, స్వామి, ఏసయ్య, ఇందిరమ్మ, యూసుఫ్, వెంకటస్వామి పాల్గొన్నారు.